


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 23-5-2025

సంపుటి: 21 సంచిక: 51
పేజీలు: 8 వెల: రూ.1

# వంకర తీర్చిన శంకర



- రెండేసి ఇన్‌ఛార్జిలకు మంగళం
- కలిసి రానివారిని వదిలించుకునే ప్రయత్నం
- గత ఎన్నికలు, విధేయతే ప్రమాణికం
- అధ్యక్ష బరిలో పాండ్రంకి, ఉంగటి
- ప్రధాన కార్యదర్శిగా కోరాడ హరి
- నగర తెలుగు యువత అధ్యక్షుడిగా గిరిజాశంకర్







శంకరేంటి.. ఎమ్మెల్యే అభ్యర్థేంటి.. అసలు మనం చేస్తేనే కదా గెలిచేది.. మనం ఎటుంటే అటే ఎమ్మెల్యే అన్న రీతిలో వంకరటింకరగా గడిచిన ఎన్నికల్లో వ్యవహరించిన టీడీపీ నగర కేడర్‌కు గొండు శంకర్ గట్టి దెబ్బే కొట్టారు. ఎన్నికలై ఏడాదైనా ఇంకా పాత వాసనలు వదిలించుకోని వారిని ఆయనే వదిలేశారు. అంతా పార్టీ నిర్ణయమేనని బయటకు చెబుతూనే తన సొంత టీమ్‌ను సిద్ధం చేసుకున్నారు.

శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, కార్యదర్శుల పోస్టులు దాదాపు ఖరారైపోయాయి. లాంఛనంగా ప్రకటించడమే తరువాయి. రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు జిల్లాలో లేకపోవడం వల్ల ప్రకటన విడుదల వాయిదా పడింది. లేదంటే.. పార్లమెంటరీ పరిధి మహానాడులోనే కమిటీని ప్రకటించి ఉండేవారు. ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు నగర టీడీపీ అధ్యక్షుడిగా మాజీ కౌన్సిలర్ పాండ్రంకి శంకర్, ప్రధాన కార్యదర్శిగా కోరాడ హరిగోపాల్‌లను నియమించినట్లు తెలుస్తుంది.

- వార్త చివరి పేజీలో


## బహిరంగ ప్రకటన

(A) నా క్లయింటు హైదరాబాద్ కాపురస్తులు శ్రీమతి విష్ణు మొలకల శైలజ W/o V.R.S.వెంకటేశ్వరరావు గారు ఇచ్చిన భోగట్టాపైన (I) రాజ్యాంగ సంస్థ అయిన శ్రీకాకుళం ల్యాండ్ సీలింగ్ ట్రిబ్యునల్ ఫైనల్ తేది 3-3-1982 ఆర్డర్స్ (II) మా క్లయింటు ముత్తాత దూసా బలరామస్వామి నాయుడు గారి రిజిష్టర్డు వీలునామా తేది 15-11-1942 Doc. No. 86/1942 (III) హైకోర్టు జడ్జిమెంటు తేది 28-3-2006 in A.S.Nos. 823/1997, 2386/1998, 2387/1998 (IV) హైకోర్టు ఆర్డర్స్ తేది 21-4-2014 in CPR No. 5439 / 2012 (V) హైకోర్టు Status Quo ఆర్డర్స్ IN WP No. 39615/2016 ప్రకారము క్రింద వివరించిన పేరాలు I, II, III స్థిరాస్తులపై సర్వహక్కులు కలవని కోట మెహర్ కుమార్ గారి కుమారుడు కోట సాహిత్యకు (దూసా సాహిత్య బలరామ్ S/o దూసా ఆదినారాయణ కుమారుడు కాదు) ఏ విధమైన హక్కులు లేవని విపులముగా మరియు క్రింద వివరించిన స్థిరాస్తులపైన శ్రీకాకుళం, విశాఖపట్నం కోర్టులలో, హైకోర్టులో కేసులు పెండింగులో ఉన్నవని మరియు విదేశీయుడైన కోట సాహిత్య తేది. 27-6-2019 పైన వివరించిన హైకోర్టు ఆర్డరున్ను, మన దేశ చట్టములను ఉల్లంఘించి చేసిన క్రయ దస్తావేజుల నెంబర్లు 4612/2019, 4613/2019, 4614/2019, 4615/2019, 4616/2019, 4617/2019, 4618/2019, 4619/2019 0 3 మరియు తేదీ 07-09-2011న చేసిన క్రయ దస్తావేజు నెం. 6064/2011 మరియు ఇప్పటివరకు చేసిన ఇతరత్రా లావాదేవీలు VALID కాదని మరియు VOID కావున ఈ క్రయ దస్తావేజులు ఇతరత్రా లావాదేవీలు చెల్లవని, అతనితో లావాదేవీలలో పాల్గొనినచో ప్రాసిక్యూషన్, పెనాల్టి ఇతరత్రా కోర్టు ధిక్కరణ, క్రిమినల్ చర్యలకు గురి అవుతారని ఈనాడు దిన పత్రికలో బహిరంగ ప్రకటనల ద్వార చాలాసార్లు తెలియజేయడమైనది.

(B) విదేశీయుడైన కోట సాహిత్య శ్రీకాకుళం వాసికి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చి GPA Holder ద్వారా క్రింద వివరించిన ఆస్తులను అమ్ముటకు ప్రయత్నం చేయుచున్నట్లు మా క్లయింటు దృష్టికి వచ్చినది. కావున ఇందుమూలముగా యావన్మందికి, GPA Holderకు ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయటమైనది.

(a) నిశ్చయించిన శాసనాల ప్రకారము దావాలు పెండింగులో ఉన్న ఆస్తులను కొనుగోలు, ఇతరత్రా లావాదేవీలు జరిపిన VALID కాదు మరియు VOID. (b) మన దేశ చట్టముల ప్రకారము విదేశీయుడైన కోట సాహిత్యతో స్థిరాస్తి లావాదేవీలు చేయుటకు నిషేదము కలదు. (c) సుప్రీమ్ కోర్ట్ జడ్జిమెంటు తేది. 26-2-2021 IN CIVIL APPEAL No. 9546 of 2010 ప్రకారము R.B.I ముందస్తు అనుమతి లేకుండా విదేశీయుడైన కోట సాహిత్య నుండి మన దేశములోని స్థిరాస్తులు కొనుటకు నిషేదము కలదు. కావున ఈ లావాదేవీలలో కోట సాహిత్యతో అతని GPA Holder ద్వారా పాల్గొనిన, ప్రోత్సహించిన భారీ పెనాల్టీలకు, ప్రాసిక్యూషన్, క్రిమినల్ చర్యలకు గురి అవుతారు. ఆ లావాదేవీలు చెల్లవు. (d) ఇదివరకు నా క్లయింట్ల ద్వార ఈనాడు దినపత్రికలో ఇచ్చిన బహిరంగ ప్రకటనలను ఖండన ప్రకటనలను, శ్రీ పొలిశెట్టి మురళీక్రిష్ణ అడ్వకేట్ గారి ద్వార విదేశీయుడైన కోట సాహిత్య ఇచ్చిన బహిరంగ ప్రకటనలను, ఖండన ప్రకటనలను ఈ బహిరంగ ప్రకటనలో భాగంగా పరిగణించవలెను.

(I) శ్రీకాకుళం జిల్లా మరియు మండలం, పాత్రునివలస గ్రామంలో ఉన్నటువంటి పల్లపు భూములు శ్రీకాకుళం వాస్తవ్యులు లేటు దూసా ఆదినారాయణరావు గారికి ఏవిధమైన హక్కులు లేనటువంటి నా క్లయింటుకు వారి Cousinsకు LRT Orders ద్వారా సర్వహక్కులు కలిగిన భూములు వివరములు:

| వ. నెం. | పాత సర్వే | కొత్త సర్వే | విస్తీర్ణం |
|---|---|---|---|
| 1. | 489 | 278/1 | Ac 0.18 Cents |
| 2. | 488 | 278/2 | Ac 19.10 Cents |

(II) శ్రీకాకుళం జిల్లా మరియు మండలం పాత శ్రీకాకుళం రూరల్, కిల్లిపాలెం పంచాయతీలో ఉన్నటువంటి భూములు శ్రీకాకుళం వాస్తవ్యులు లేటు దూసా ఆదినారాయణరావు గారికి కేవలం జీవిత కాలములో అనుభవించుటకు మాత్రమే క్రయము వగైరా హక్కులు లేనటువంటి ఆయన తదనంతరం అనగా తేది: 04-07-2008 నుండి నా క్లయింట్లకు వారి Cousinsకు సర్వహక్కులు కలిగినటువంటి భూముల వివరములు.

| వ.నెం. | పాత సర్వే | కొత్త సర్వే | విస్తీర్ణం |
|---|---|---|---|
| 1. | 33, 35/2 | 8/1, 5/1, 5/1A | Ac 4.58 Cents |
| 2. | 36, 40/1 | 5/1B, 1/2, 2/1 | |

(III) శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం టౌను, బ్రిడ్జి రోడ్డు, డోరు నెం. 9-4-19 గల కూలిపోయిన ఇంటి ఆవరణ 1161 చదరపు గజముల ఇంటి స్థలం నా క్లయింట్లు, వారి Cousins ముత్తాత పూర్వికుల ఆస్తి 3/4వ వంతు వారి తల్లుల ద్వారా సర్వ హక్కులతో కలిగిన ఆస్తి - శ్రీకాకుళం వాస్తవ్యులు లేటు దూసా ఆదినారాయణరావు గారికి ఏవిధమైన హక్కులు లేనటువంటి ఆస్తి. మిగతా 1/4వ వంతు దూసా ఆదినారాయణరావు గారి, ఆయన భార్య దూసా సరోజిని రామాయమ్మ గారి తదనంతరము అనగా 29-12-2010 నుండి నా క్లయింట్లుకు వారి Cousinsకు సర్వహక్కులతో కలిగిన ఆస్తి.

పంచిరెడ్డి ఈశ్వరరావు, అడ్వకేట్,
శ్రీకాకుళం, సెల్ నెం. 99495 02216

శ్రీకాకుళం,
తేదీ 23-5-2025.


# రక్షణ కవచాల్నే కొట్టేశారు!

- విజయగణపతి ఆలయం వద్ద.. సుందీరకరణ పేరుతో తొలగింపు
- ఇది మున్సిపల్ సిబ్బంది నిర్వాకం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చిన్న చిన్న తప్పిదాలే జీవితాంతం పొగిలి పొగిలి ఏడ్చేలా.. పొంత నిండిపోయేంత కన్నీటిని మిగులుస్తాయి. అలా అని అవి పరిష్కరించలేనంత పెద్ద సమస్యలు కావు. వాటి కోసం ప్రత్యేకంగా తీర్మానాలు చేయనక్కర్లేదు. బడ్జెట్లు విడుదల చేయక్కర్లేదు. కేవలం మనలాంటివే మిగిలిన ప్రాణాలు కూడా అన్న స్పృహ.. పరిష్కరించాలన్న చొరవ ఉంటే చాలు. నగరంలోని విజయగణపతి ఆలయం వద్ద 2023 నవంబరు 23న ద్విచక్ర వాహనంతో రోడ్డు క్రాస్ చేస్తున్న రైతుబజార్ సచివాలయ ఉద్యోగిని మౌనిక ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో మరణించింది. ఈ దారుణ ఘటనకు కారణం ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం వద్ద కేవలం ఓ చిన్న స్పీడ్ బ్రేకర్ లేకపోవడమే. నగరంలో ఏ సందులోకి వెళ్లినా సీసీ రోడ్లకు అడ్డంగా ఇష్టారాజ్యంగా వేసిన స్పీడ్‌బ్రేకర్లు కనిపిస్తుంటాయి. కానీ అవసరమైన క్రాసింగ్‌ల వద్ద, స్కూల్ జోన్‌ల వద్ద ఇవి మచ్చుకైనా కనిపించవు. అందుకే మౌనిక లాంటి వారు మరణిస్తున్నారు. మౌనిక బ్రెయిన్ డెడ్ కావడంతో ఆమె అవయవాలను కుటుంబ సభ్యులు దానమివ్వడంతో ఆ రోడ్డు ప్రమాదం ప్రాచుర్యంలోకి వచ్చింది. లేకపోతే అన్ని రోడ్ యాక్సిడెంట్ల మాదిరిగానే ఇదీ గాలిలోనే కలిసిపోయుండేది. పెద్దఎత్తున ఆమె అవయవదానానికి స్పందన రావడంతో స్పీడ్‌బ్రేకర్ మీద చర్చ జరిగింది. దీంతో మున్సిపల్ యంత్రాంగం ఇక్కడ మౌనిక మరణం తర్వాత స్పీడ్‌బ్రేకర్‌ను ఏర్పాటు చేసింది. కానీ ఈమధ్య రోడ్ల మరమ్మతు, పాలకొండ రోడ్డు సుందరీకరణలో భాగంగా మౌనిక చనిపోయిన చోట స్పీడ్ బ్రేకర్‌ను తొలగించేశారు. స్థానిక డే అండ్ నైట్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలకు, నానుబాల వీధి వైపు నుంచి వచ్చే వాటికి ఇదే జంక్షన్ కావడం వల్ల మరో మౌనికను బలి తీసుకుంటే తప్ప స్పీడ్‌బ్రేకర్ వేయరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇందుకోసం బడ్జెట్లు, అనుమతులు, శంకుస్థాపనలు అవసరం లేదు కదా..!

- పుణ్యపు వీధి జంక్షన్‌లో.. కొత్తగా వేసిన దాన్నే పీకేశారు
- దీనికి ఓ డాక్టర్ స్వార్థం కారణం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడం పుణ్యాన వచ్చిన నిధులతో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ నగరంలోని పాలకొండ రోడ్డును సుందరీకరించారు. నాలుగు నిధులొస్తే చాలు.. నగరాన్ని సుందరీకరించుకోవాలనేది ఆయన ఆలోచన. ఎప్పుడో తెలుగుదేశం హయాంలోనే విస్తరించిన పాలకొండ రోడ్డులో పాత డివైడర్లు తొలగించి కొత్తవి నిర్మించి వాటికి సొబగులు అద్దుతున్నారు. డివైడర్‌కు ఎక్కడ పడితే అక్కడ ఖాళీలు వదిలితే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్న ఇంజినీర్ల సూచన మేరకు తక్కువ ప్రాంతాల్లోనే డివైడర్ల మధ్య ఖాళీలు వదిలారు. అందులో భాగంగా కృష్ణా పార్క్ జంక్షన్ వద్ద డివైడర్‌ను ఓపెన్ చేసి మిగిలిన చోట్ల డివైడర్‌తో పాటు స్టెప్ ఇన్ ఫుట్‌పాత్‌లు నిర్మించారు. వీటికే ఇప్పుడు రంగులు, ముగ్గులు వేసి టైల్స్ అంటిస్తున్నారు. ఈలోగానే కృష్ణాపార్క్ జంక్షన్‌కు బెత్తెడు దూరంలో ఉన్న పుణ్యపు వీధిలోకి వెళ్లడానికి డివైడర్ అడ్డుగా ఉందంటూ రాత్రికి రాత్రే కొందరు దాన్ని తవ్వీపారేశారు. ఈ పని ఎవరు చేసుంటారని, అంత ధైర్యంగా ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసింది ఎవరా అని ఆరా తీస్తే.. అక్కడే ఉన్న ఒక ప్రైవేటు పీఎంపీ వైద్యుడే కారణమని తెలిసింది. ఈ డివైడర్ నిర్మించిన తర్వాత తన వద్దకు వచ్చే పేషెంట్ల సంఖ్య తగ్గిపోయిందని భావించి, దీన్ని తొలగింపజేశారని చెప్పుకొంటున్నారు. ఇంతవరకు ఆయన చేతిమాత్రే వైకుంఠ యాత్ర అనుకునేవారు. ఇప్పుడు ఆయన చర్యల వల్ల కూడా ప్రమాదాలు జరిగి ఎవరైనా వైకుంఠానికి పోతే బాధ్యత వహించేది మున్సిపాలిటీనా, లేదూ సుడానా, లేక ఈ వైద్యుడా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు.

• ఎడిటోరియల్

# భారత్‌కు కొత్త సవాల్.. త్రీ బ్రదర్స్!

ఇప్పటికే ఇటు పాకిస్తాన్, అటు చైనా.. కొత్తగా బంగ్లాదేశ్ నుంచి సవాళ్లు ఎదుర్కొంటున్న భారత్‌కు ఇప్పుడు త్రీ బ్రదర్స్ అలయన్స్ రూపంలో మరో ప్రమాదకరమైన ముప్పు ఎదురవుతోంది. త్రీ బ్రదర్స్ అంటే పైన పేర్కొన మూడు దేశాలు కాదు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌తో పాటు ఇటీవలి ఆపరేషన్ సింధూర్ సమయంలో ఆ దేశానికి వెన్నుదన్నుగా నిలిచిన టర్కీ, అజర్‌బైజాన్ దేశాలు త్రీ బ్రదర్స్ అలయన్స్ పేరుతో జట్టు కట్టాయి. ఆపరేషన్ సింధూరు సమయంలో వీరి సహకార పర్వం బయటపడినా వాస్తవానికి నాలుగేళ్లుగా ఈ మూడు దేశాలు రాజకీయ, ఆర్థిక, సైనిక సంబంధాలను బలోపేతం చేసుకుంటున్నాయి. 2021లో అజర్ బైజాన్ రాజధాని బాకులో జరిగిన సమావేశంలో పాకిస్తాన్, టర్కీ, అజర్‌బైజాన్ అధినేతలు పరస్పర సహకారంతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలన్న లక్ష్యంతో 'త్రీ బ్రదర్స్ అలయన్స్' పేరుతో అనధికార కూటమి ఏర్పాటు చేశారు. ఈ మూడు దేశాల మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు కూడా ఉన్నాయి. టర్కీ, అజర్‌బైజాన్ దేశాలు తురుష్క వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. పైగా ఈ మూడూ ముస్లిం జనాభా అధికంగా కలిగిన దేశాలు. టర్కీ అధ్యక్షుడు రెసెప్ ఎర్డోగాన్ ఈ కూటమి వెనుక ప్రధాన శక్తిగా ఉన్నారు. టర్కీ ప్రభావాన్ని ప్రపంచంలో మరింత విస్తరించడమే లక్ష్యంగా ఆయన ఈ కూటమికి ఊపిరి పోశారు. ఉదాహరణకు 2020 నాగోర్నో-కరబాఖ్ సంఘర్షణలో అజర్‌బైజాన్‌కు టర్కీ సైనిక మద్దతు అందించడం ద్వారా ఆర్మేనియాపై అజర్‌బైజాన్ విజయానికి దోహదపడింది. అదేవిధంగా 1950 నుంచి టర్కీతో పాకిస్తాన్ సన్నిహిత రక్షణ సంబంధాలను కలిగి ఉంది. ఆ విధంగా క్రూయిజ్ మిసైల్స్, డ్రోన్లు, ఇతర ముఖ్యమైన సైనిక సాంకేతికతను అందుకుంది. సైనిక సహకారాన్ని ప్రస్ఫుటం చేస్తూ 2021లో ఈ మూడు దేశాలు సైనిక విన్యాసాలు ప్రారంభించాయి. ఈ కూటమి దేశాలు ప్రాదేశిక వివాదాల్లో పరస్పరం మద్దతు ఇచ్చుకుంటాయి. అంటే.. కశ్మీర్ సమస్యపై పాకిస్తాన్ విధానానికి టర్కీ, అజర్‌బైజాన్ మద్దతు ఇస్తాయన్న మాట. అందుకే టర్కీ ఐక్యరాజ్యసమితి వంటి వేదికలపై కశ్మీర్ సమస్యను పదేపదే లేవనెత్తింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరగ్గా అజర్‌బైజాన్, టర్కీ రాజకీయంగా పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చాయి. భారతదేశంపై దాడుల్లో టర్కీ అందజేసిన డ్రోన్లను పాకిస్తాన్ ఉపయోగించింది. ఇది ఈ కూటమి సైనిక సహకార తీవ్రతను సూచిస్తుంది. ఈ కూటమి విసిరే సవాలును ఎదుర్కోవడానికి భారతదేశం ఇరాన్, ఆర్మేనియాలతో సన్నిహితంగా ఉంటోంది. ఆర్మేనియాకు అజర్‌బైజాన్‌తో దశాబ్దాలుగా సరిహద్దు వివాదాలు ఉన్నాయి. ఇరాన్ కూడా అజర్‌బైజాన్‌తో ఉద్రిక్తతలను ఎదుర్కొంటోంది. ఇరాన్‌లో నివసిస్తున్న లక్షలాది అజారీలు అజర్‌బైజాన్‌తో సాంస్కృతిక సంబంధాలను కలిగి ఉన్నారు. వీటిని ఉపయోగించుకుని తమ దేశంలో అజర్‌బైజాన్ విభజన ఉద్యమాలను ప్రోత్సహించవచ్చన్నది ఇరాన్ ఆందోళన. మరోవైపు భారతదేశం ఆర్మేనియాకు వెపన్ లొకేటింగ్ రాడార్లు, ఆర్టిలరీ సిస్టమ్స్, రాకెట్ లాంచర్లను విక్రయించింది. గత ఏడాది ఆస్ట్రా మిసైల్స్ కొనుగోలు, ఆర్మేనియా ఎస్‌యు30 ఫైటర్‌జెట్‌లను అప్‌గ్రేడ్ చేయడంపై చర్చలు కూడా జరిగాయి. ఇవి అజర్‌బైజాన్‌ను కలవరపరిచాయి. అదేవిధంగా టర్కీతో ప్రాదేశిక వివాదంలో ఉన్న సైప్రస్‌తో సంబంధాలను భారత్ బలోపేతం చేసి రాజకీయ మద్దతు ఇస్తే సైప్రస్ భారత రాజకీయ ప్రాధాన్యతలకు అండగా నిలిచింది. ఇది టర్కీని అసహనానికి గురిచేసింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఒక టర్కీ విశ్వవిద్యాలయంతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. అలాగే.. భారతీయ పర్యాటకులు టర్కీ, అజర్‌బైజాన్‌లను బహిష్కరించాలని సామాజిక మాధ్యమాల్లో పిలుపునివ్వడంతో పాటు ఆ దేశాలకు వెళ్లేందుకు చేసుకున్న టూర్ ప్యాకేజీలను రద్దు చేసుకుంటున్నారు. త్రీ బ్రదర్స్ అలయన్స్ సవాలును ఎదుర్కోవడానికి భారతదేశం గ్రీస్, సైప్రస్, ఆర్మేనియా, ఇరాన్ వంటి దేశాలతో సన్నిహితంగా వ్యవహరిస్తూ.. సహకారాన్ని కొనసాగించే అవకాశం ఉంది. టర్కీ, అజర్‌బైజాన్‌తో భారతదేశ సంబంధాలు ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్నాయి కానీ పూర్తిగా శత్రుత్వంగా మారలేదు. అయితే రానున్న కాలంలో ఇవి మరింత దిగజారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ కూటమి పెను సవాలుగా మారకుండా దాని ప్రభావాన్ని తగ్గించడానికి భారతదేశం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.

# కార్యకర్తలకు పెద్దపీటవేస్తాం

- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు
- ప్రతీ కార్యకర్త మాకుటుంబ సభ్యుడే
- ఎమ్మెల్యే గొండు.శంకర్
- ఆహ్లాదకరంగా శ్రీకాకుళం పార్లమెంటు స్థాయి మినీ మహానాడు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్యకర్తలకు పెద్దపీటవేస్తామని, పౌర విమానాయ శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. స్థానిక జిల్లా టీడీపీ పార్టీ కార్యక్రమంలో శ్రీకాకుళం పార్లమెంటు స్థాయి మినీ మహానాడు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో భాగంగా ఎంపీ మాట్లాడుతూ జిల్లా నలు మూలల నుండి అధిక సంఖ్యలో గ్రామ, మండల, జిల్లా స్థాయి నుండి కార్యకర్తలు పాల్గొనటం ఆనందంగా ఉందని, నాయకులకు, కార్యకర్తలకు అనుసంధానం చేసే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ ఏ నినాదంతో పార్టీ స్థాపించారో అందుకు అనుగుణంగానే తెలుగు జాతి ఖ్యాతిని ఇనుమడింపజేసి సుదీర్ఘపాలన కొనసాగిస్తున్న నేత నారా చంద్రబాబునాయుడని, అందుకు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు సుదీర్ఘ పాదయాత్ర చేసి, ప్రజల కష్ట, సుఖాలను తెలుసుకొని, అహర్నిశలు కష్టపడి ఎన్డీయే కూటమి సాధించారన్నారు. కేంద్రంలో ఆనాడు మొదటిసారి బీసీ కేంద్రమంత్రి ఎర్రన్నాయుడని, ఇప్పుడు ఆయన వారసుడు, దేశంలోనే అతి పిన్న వయస్కుడు రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రి పదవిని చేపట్టడం శ్రీకాకుళం జిల్లాకే కాకుండా, దేశానికే గర్వకారణమన్నారు. ఆరు శాఖలతో మంత్రిపదవికి అచ్చెన్నాయుడు చేపట్టారంటే, తెలుగుదేశం పార్టీ బిసిలకు ప్రాధాన్యత నిచ్చే పార్టీ అన్నారు. కార్యకర్తలకు అండగా టీడీపీ ప్రభుత్వం నిలుస్తుందని, ప్రతీ కార్యకర్త టీడీపీ కుటుంబ సభ్యులేనని, నేను కూడా కార్యకర్తగానే ఈ స్థాయికి వచ్చానని గుర్తుచేశారు. తెలుగుదేశంపార్టీ క్రమ శిక్షణతో కూడిన పార్టీ అని, అధిష్టానం కష్టించే ప్రతీ కార్యకర్తను గుర్తుపెట్టుకొని సముచిత స్థానం కల్పిస్తారన్నారు. అర్ధరాత్రి అయినా ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని, ఎప్పుడు, ఎవరికి ఏ సమస్య వచ్చినా నన్ను సంప్రదించవచ్చన్నారు. ఈ రోజు మినీ మహానాడు కార్యక్రమంలో అందరినీ కలుసుకోవటం ఆనందంగా ఉందని, ఈ వేడుకలను కేంద్ర మంత్రితోపాటు, జిల్లా అధికారులు, సహచర శాసన సభ్యులతో జరుపుకోవటం మహానందాన్నిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు, జిల్లా నాయకులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవానికి ఊపందిన కార్యక్రమాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా యోగా కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్న ప్రత్యేక కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని జిల్లాల్లోనూ నెల రోజుల పాటు యోగా శిక్షణా శిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనల మేరకు శుక్రవారం శ్రీకాకుళం పట్టణంలోని 80 అడుగుల రోడ్డులో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యోగా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, గార మండలాల నుండి ఐసిడిఎస్ సిబ్బంది, చిల్డ్రన్‌హోమ్స్‌కు చెందిన చిన్నారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మొత్తం 700 మందికి పైగా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం విశేషం. యోగా ద్వారా శరీర ధృడత్వం, మానసిక ఆరోగ్యం సాధ్యమవుతుందని వారు వివరించారు. ప్రజలు యోగా ప్రాముఖ్యతను తెలుసుకొని దాన్ని జీవన శైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ సమన్వయ అధికారి డాక్టర్ జగదీష్, ఐసిడిఎస్ అధికారి బి.శాంతిశ్రీ, నోడల్ అధికారి మనెమ్మ, ఇద్దరు మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ఏపీఈఏపి సెట్

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)



ఆంధ్రప్రదేశ్ ఈఏఎంసెట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఎచ్చెర్ల మండల కేంద్రంలో శివాని ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, మధ్యాహ్నం షిఫ్టులుగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కాకినాడ జేఎన్టీయూ నిర్వహిస్తున్న పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులు ఉదయానికే పరీక్షా కేంద్రాలకు చేరుకుంటున్నారు. క్షుణ్ణంగా పరిశీలించిన మీదట వారి నిర్వాహకులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

(సత్యంన్యూస్, రణస్థలం)


పర్యావరణాన్ని, వనరులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పుట్టపర్తి నుంచి వచ్చిన ఎలక్ట్రికల్ ఇంజినీర్, సామాజిక వేత్త రాజు సూచించారు. కోష్ట పంచాయతీలో మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజి నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు తెలుగు భాష ప్రాధాన్యాన్ని వివరించారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషను విస్మరించవద్దన్నారు. మానవతా విలువలు, సేవా భావం చిన్నప్పటినుంచే అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెడిటేషన్, సూర్యనమస్కారాల విశిష్టత వివరించి సాధన చేయించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన, క్రమ శిక్షణతో మెలగాలని సూచించారు. చదువులో రాణిస్తూ తల్లి దండ్రులకు, గురువులకు పేరు తీసుకురావాలని సూచించారు. చేస్తున్నది చిన్న ఉద్యోగమే అయినా సామాజిక బాధ్యతగా ఇంత మంచి కార్యక్రమం చేస్తున్న అమ్మోజీని అభినందించారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బమ్మిడి అమ్మోజి, విద్యార్థుల తల్లిదండ్రులు వారికి సత్కరించారు. ఎంపీడీవో కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ విజయేంద్ర, త్రివేణిలు పాల్గొన్నారు.



# ఉన్న ఒక్కటి కూడా డౌటేనా..?

కెరీర్ ఫామ్‌లో ఉన్నప్పుడు వద్దన్నా సరే ఛాన్స్‌లు వస్తాయి. కాస్త గ్రాఫ్ పడిపోతే మాత్రం చేతిదాకా వచ్చిన అవకాశం కూడా చేజారుతుంది. ఇలాంటివి ఇంతకుముందు చాలా మందికి జరిగాయి ఇప్పుడు కూడా జరుగుతున్నాయి. ఐతే ప్రస్తుతం ఇదే బుట్ట బొమ్మ పూజా హెగ్దే విషయంలో రిపీట్ అవుతుంది. టాలీవుడ్ లో వరుస స్టార్ సినిమాలతో దూసుకెళ్తున్న అమ్మడు ఎందుకో సడెన్‌గా డ్రాప్ అయిపోయింది. ప్రభాస్ తో రాధే శ్యామ్ చేసిన అమ్మడు ఆ నెక్స్ట్ మహేష్‌తో గుంటూరు కారం ఛాన్స్ కూడా అందుకున్నట్టే అనిపించగా సినిమా నుంచి మధ్యలో తప్పుకుంది. ఆ తర్వాత ఒక్కటంటే ఒక్క ఛాన్స్ పూజా హెగ్దేకి ఇవ్వలేదు. ఈమధ్య అమ్మడు రెట్రో సినిమా ప్రమోషన్స్ లో పూజా హెగ్దే ఒక తెలుగు సినిమా చేస్తున్నట్టు వెల్లడించింది. ఐతే ఆ టీం అఫీషియల్ గా అనౌన్స్ చేసే దాకా వెయిట్ చేయాలని అన్నది. ఐతే తెలుస్తున్న సమాచారం ప్రకారం ఇప్పుడు ఆ ప్రాజెక్ట్ నుంచి పూజా హెగ్దేని తప్పించారని టాక్. సూర్య సినిమాలో ఆమె నటించినా సరే పెద్దగా ఇంపాక్ట్ క్రియేట్ చేయలేదు. ప్రస్తుతం పూజా హెగ్దే మీద ఆడియన్స్ అంత ఇంట్రెస్ట్ గా లేరన్నట్టుగా చెబుతున్నారు. అందుకే వచ్చిన ఆ ఒక్క ఛాన్స్ కూడా ఆమె నుంచి చేజారిందని అంటున్నారు. ఐతే అది నిజమా కాదా అన్నది మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశాక తెలుస్తుంది. ఏది ఏమైన పూజా బేబ్ కి టఫ్ టైం నడుస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అటు బాలీవుడ్ లో కూడా అమ్మడు సినిమాలైతే చేస్తుంది కానీ ఏ ఒక్కటి సరైన సక్సెస్ ఇవ్వట్లేదు. ప్రస్తుతం అమ్మడు వరుణ్ ధావన్ తో సినిమాకు రెడీ అవుతుంది. కనీసం సౌత్‌లో ఎలాగు లక్ కలిసి రావట్లేదు కాబట్టి అమ్మడికి బాలీవుడ్ లో అయినా సక్సెస్ ఫేజ్ మొదలవుతుందేమో చూడాలి. పూజా హెగ్దే మాత్రం సౌత్ సినిమాల మీద తన ప్రేమను చూపిస్తూనే ఉంది. కానీ ఇక్కడ ఛాన్స్ లు మాత్రం అంత ఈజీగా రావట్లేదు. ఐతే టాలీవుడ్ లో ఉన్న పూజా ఫ్యాన్స్ మాత్రం ఆమె ఇక్కడ సినిమాలు చేయాలని కోరుతున్నారు. ఛాన్స్ రానిది ఆమె కూడా ఏం చేయలేదు కాబట్టి సో వెయిటింగ్ తప్పదని చెప్పొచ్చు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..



# థియేటర్ల దుస్థితికి కారణం హీరోలేనా?

థియేటర్ వ్యవస్థ ఇది వరకు ఉన్నంత స్ట్రాంగ్‌గా లేదన్నది నిజం. దానికి చాలా కారణాలు ఉన్నాయి. చాలా థియేటర్లు మూతపడ్డాయి. కొన్ని కల్యాణమండపాలుగా, షాపింగ్ కాంప్లెక్సులుగా మారిపోయాయి. మిగిలిన థియేటర్లలో కొన్నింటిని ఉంచాలా? మూసేయాలా? అనే తర్జన భర్జనలు జరుగుతున్నాయి. థియేటర్లని నడపలేమని ఎగ్జిబ్యూటర్లు గగ్గోలు పెడుతున్నారు. ఆ పంచాయితీ ఇప్పుడు నిర్మాతలకు నిద్ర లేకుండా చేస్తోంది. జూన్ 1 నుంచి సమ్మె లేకపోవొచ్చు, కానీ, ఈ తలనొప్పి మాత్రం ఇక ముందు కూడా కొనసాగే అవకాశం ఉంది.



పంచాయితీ ఇప్పుడు పర్సంటేజీ గురించే కావొచ్చు. కానీ.. అసలు ఈ ముసలం మొదలవ్వడానికి కారణం ఒక రకంగా మన హీరోలే. పెద్ద హీరోలు యేడాదికి ఒకటి, రెండేళ్లకు ఒకటి అంటూ చాలా నిదానంగా సినిమాలు చేస్తున్నారు. దాంతో సీజన్ వచ్చేసరికి బాక్సాఫీసు దగ్గర సరైన సినిమా ఉండడం లేదు. అందుకు వేసవినే పెద్ద సాక్ష్యం. వేసవి సీజన్‌లో ఒక్క స్టార్ సినిమా కూడా రాలేదు. అలాంటప్పుడు థియేటర్లకు ఊపు ఎలా వస్తుంది?

చిన్న సినిమాల కోసం జనాలు థియేటర్ల దగ్గర క్యూ కట్టే పరిస్థితి లేదు. మీడియం రేంజ్ సినిమాలపై నమ్మకాలు తగ్గిపోతున్నాయి. ఓ పెద్ద స్టార్ సినిమా వస్తే తప్ప, బాక్సాఫీ సుకు ఊపు రాదు. కానీ బడా హీరోలు మాత్రం సినిమాలు చేయడంలో మీన మేషాలు లెక్కేస్తున్నారు. ఎన్టీఆర్, చరణ్, బన్నీ, ప్రభాస్, మహేష్ వీళ్లే మనకున్న టాప్ హీరోలు. వీళ్లు రెండేళ్లకు ఒక సినిమా చేస్తున్నారు. ప్రభాస్ కొంత లో కొంత నయం. ఒకేసారి చేతిలో కొన్ని ప్రాజెక్టుల్ని ఉంచుకొన్నాడు. మిగిలిన వాళ్లు చాలా స్లో అండ్ స్టడీగా ముందుకు వెళ్తున్నారు.

వాళ్లకున్న క్రేజ్, ఆయా సినిమాలపై ప్రేక్షకులు, అభిమానులు పెట్టుకొన్న నమ్మకాలు హీరోల ముందరి కాళ్లకు బంధనాలుగా మారుతున్నాయి. అందుకే ప్రతీ చిన్న విషయంలోనూ జాగ్రత్తలు తీసుకొంటున్నారు. రీషూట్లు, రీ రైట్లూ చేసుకొంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఈ విషయంలో వాళ్లని తప్పు పట్టలేం. కాకపోతే థియేటర్లకు కంటెంట్ కావాలి. జనాలు మళ్లీ థియేటర్ల వైపు చూడాలంటే స్టార్ సినిమాలు రావాలి. చాలా మంది నిర్మాతలు ఇదే విషయం గుర్తు చేస్తున్నారు. ఒకప్పుడు చిరంజీవి, బాలయ్య, నాగ్, వెంకటేష్ యేడాది పొడవునా సినిమాలు చేస్తుండేవారని, ప్రతీ సీజన్‌లోనూ ఓ స్టార్ సినిమా వచ్చేదని, ఓపెనింగ్స్ హడావుడి కనిపించేదని, ఇప్పుడు ఆ వాతావరణం ఎప్పుడో చూసే అవకాశమే రావడం లేదని మనోవేదన వెళ్లగక్కుతున్నారు.

ప్రస్తుతం జరుగుతున్న పంచాయితీని కూడా హీరోలు పట్టించుకొన్న దాఖలానే కనిపించలేదు. 'ఇదేదో మన వ్యవహారం కాదులే' అంటూ దూరంగానే ఉన్నారు. హీరోలు కూడా వాస్తవ పరిస్థితిని ఓసారి బేరీజు వేసుకోవాలి. సినిమా అనే వ్యవస్థకు నిర్మాత, హీరో ఎంత అవసరమో.. థియేటర్ కూడా అంతే అవసరం. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత హీరోలపై ఉంది. పారితోషికాలు కాస్త తగ్గించుకొని, వీలైనన్ని ఎక్కువ సినిమాలు చేస్తే ఈ వాతావరణంలో మార్పు వచ్చే అవకాశం కచ్చితంగా ఉంది. మరి మన హీరోలు అంత త్యాగం చేస్తారా? అనేదే పెద్ద ప్రశ్న.


- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

## కుంభా, తమ్మినేనిని సత్కరించిన గొర్లె



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమంలో శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం పరిశీలకులుగా నియమితులైన కుంభా రవిబాబు, వైకాపా రాష్ట్ర పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా నియమితులైన తమ్మినేని సీతారాంను మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా గజమాల, శాలువా వేశారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న పలు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ఎండగట్టారు. ఇప్పటి నుంచి వైకాపా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవి, వైకాపా రాష్ట్ర కళింగవైశ్య సంఘం అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, తదితరులున్నారు.



మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, హెచ్.ఆర్. పాలసీ అమలు, ప్రమోషన్‌లు ఇవ్వాలని తదితర డిమాండ్లు అమలు చేయాలని కోరుతూ కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టి.తిరుపతిరావు తదితరులున్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

### వైకాపాను తిట్టడమే
## మహానాడు ప్రధాన అజెండా

**- ఉపాధి హామీ కూలీలతో ఆమదాలవలసలో తెదాపా మహానాడు**
**- ఆమదాలవలస వైసీపీ ఇంచార్జి చింతాడ రవికుమార్**

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలసలో ఇటీవల టీడీపీ నిర్వహించిన మహానాడుకు వచ్చిన జనాలంతా ఉపాధి హామీ కూలీలేనని, అని వారికి మస్టర్లు వేసి మహానాడుకు తరలించారని వైకాపా సమన్వయకర్త చింతాడ రవికుమార్ విమర్శించారు. ఈమేరకు శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహానాడుకు స్వచ్ఛందంగా చాలా తక్కువమంది మాత్రమే వచ్చారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక వైకాపాను తిట్టడమే మహానాడు ప్రధాన అజెండాగా సాగుతుందని ఆరోపించారు. సంవత్సర కాలంలోనే కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. టీడీపీ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పలేక బెదిరింపులకు పాల్పడి, అక్రమ కేసులు బనాయించి డివెర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని చింతాడ ఆరోపించారు. సూపర్ సిక్స్‌లో ఒక్క పథకాన్ని కూడా అమలుచేయలేని కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తూ, రాష్ట్ర సంపదను మొత్తం అమరావతిలో పెడుతున్నారన్నారు. మహానాడు కార్యక్రమంలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడులు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో అభివృద్ధిని వైకాపా అడ్డుకుంటుందని అబద్దాలు చెప్పారన్నారు. అసలు జిల్లా అభివృద్ధి జరిగిందే వైకాపా హయాంలో అన్న విషయాన్ని వారు గుర్తుకు తెచ్చుకోవాలని హితవు పలికారు. దీనిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, వారు కూడా సిద్ధపడాలని సవాల్ విసిరారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలేసి ఇసుక దోపిడీ చేస్తూ రోజుకు సుమారు రూ.కోటి చొప్పున స్వాహా చేస్తున్నారన్నారు. అలాగే లిక్కర్‌షాప్‌లలో 20 శాతం మామూళ్లు వసూలుచేసుకుంటూ దోపిడీ చేసిన సొమ్ముతో అమెరికాలో హోటల్ కట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని రవికుమార్ విమర్శించారు. కూటమి నాయకులు దోపిడీలకు పాల్పడుతూ వైకాపా నాయకులపై అబాండాలు వేయడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్షణమే ఇటువంటి విధానాలను విడనాడాలని రవికుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, ఆమదాలవలస మునిసిపల్ పార్టీ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, ఆమదాలవలస మాజీ పాక్స్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.





వైకాపా శ్రీకాకుళం పార్లమెంట్ పార్టీ పరిశీలకులుగా నియమితులైన ఎమ్మెల్సీ కుంభా రవిబాబు జిల్లా వైకాపా కార్యాలయానికి శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. అదే విధంగా ఇటీవల జగన్మోహన్‌రెడ్డి పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతిని వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా నియమించినందున ఆమెకు జిల్లా నాయకులు దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## మంచి సందేశాత్మక చిత్రం "రొమియో"

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సందేశాత్మక చిత్రంగా "రొమియో" నిలుస్తుందని, ముఖ్యంగా యువతకు హత్తుకునేలా ఉంటుందని రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు శుక్రవారం అన్నారు. స్థానిక పి.ఎన్.కాలనీలో ఉన్న వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయంలో రొమియో ఇండిపెండెంట్ చిత్రం ముహూర్తపు సన్నివేశాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు క్లాప్ కొట్టి ప్రారంభించి మాట్లాడుతూ ఈ దేవాలయంలో పూజ కార్యక్రమం జరుపుకున్న చిత్రాలన్నీ విజయవంతం అయ్యాయని, ఈ చిత్రం కూడా ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులతో విజయం సాధిస్తుందన్నారు. శ్రీకాకుళం నుండి ఉత్తమ కళాకారులున్నారని, వారి ప్రతిభను బయట ప్రపంచానికి తెలియజేయటం హర్షణీయమన్నారు. ఈ చిత్రంలో నటించే ప్రతీ ఒక్కరూ కష్టపడి నటించారని, వారి ప్రతిభను ప్రత్యక్షంగా చూశానన్నారు. రొమియో చిత్రం మంచి విజయం సాధించి మన కళాకారులకు, చిత్ర దర్శక, నిర్మాతలకు, నటీనటులకు, సహాయ నటులకు, చిత్ర యూనిట్ సభ్యులకు మంచి పేరు, ప్రఖ్యాతులు సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిత్ర హీరో, కెమెరా మాన్, డైరెక్టర్ ఐన తేజ్ మహేంద్ర, డైరెక్టర్ ప్రేమ్ సుప్రీమ్, డైరెక్టర్ తారక్, సీనియర్ నటులు రమేష్ నారాయణ్, అగ్గున బాబురావు, రమణ మణిగాము, సాయి సుధాకర్, ఇతర నటీనటులు పాల్గొన్నారు.



## ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

**- ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం**
**- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నియోజకవర్గం నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు గార, శ్రీకాకుళం రూరల్ మండలం, శ్రీకాకుళం టౌన్ నుంచి పెద్ద ఎత్తున ప్రజలు విశాఖ–ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకొని వినతులను శుక్రవారం అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారం మార్గం చూపిస్తామని శంకర్ అన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గత ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో పెద్ద ఎత్తున నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, డ్రైన్లు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తున్నామని గత 10నెలల్లోనే ప్రజాప్రభుత్వంగా ప్రజలతో మన్ననలు అందుకున్నామని వివరించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి, అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని శంకర్ వివరించారు. ఇళ్లు కావాలని పెద్ద ఎత్తున వినతులు అందుతున్నాయని రాష్ట్ర మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఒక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాంగోపాల్‌నాయుడుకు కీర్తిచక్ర అవార్డు

(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

మండలం నగిరిపెంటకు చెందిన మేజర్ మల్లా రాంగోపాల్‌నాయుడికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము లికీర్తిచక్రలి పురస్కారాన్ని ప్రదానం చేశారు. దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గురువారం గ్యాలంట్రీ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఈ పురస్కారాన్ని అందించారు. 2023 అక్టోబరు 26న ఉగ్రవాదులు చొరబాటుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం వచ్చింది. జమ్మూలోని కుప్వారా జిల్లాలో తోటి సైనికులతో కలిసి రాంగోపాల్ సోదాలు ప్రారంభించారు. అక్కడ ఇళ్లలో నక్కిన ఐదుగురు ఉగ్రవాదుల్లో ముగ్గురిని పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో రాంగోపాల్ కాల్చి చంపారు. మరొక ఉగ్రవాది తప్పించుకున్నాడు. అతని కోసం వెతుకుతుండగా రాంగోపాల్ బృందంపై ఐదో ఉగ్రవాది గ్రెనేడ్ విసిరాడు. దాని నుంచి చాకచక్యంగా తప్పించుకుని అతడిని మట్టుబెట్టి ఆపరేషన్ ముగించారు. రాంగోపాల్ చూపిన ధైర్యసాహసాలను పరిగణనలోని తీసుకుని గతేడాది 'కీర్తిచక్ర' పురస్కారానికి ఎంపిక చేశారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వంతో యాక్సిస్ ఒప్పందం రద్దు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీసభ్యులు కె.లోకనాదం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ డిమాండ్ చేశారు. యాక్సిస్, సెకి ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ట్రూ ఆఫ్, సర్ చార్జీల రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ యూనిట్ విద్యుత్‌ను రూ.4.60లు చొప్పున కొనుగోలు చేసేందుకు యాక్సిస్ కంపెనీతో రాష్ట్ర డిస్కమ్‌లు కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు విద్యుత్ చార్జీలు పెంచమని, తగ్గిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలను రెట్టింపు పెంచడం ప్రజలను దగా చేయడం కాదా అని వారు ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు స్మార్ట్‌మీటర్లు పగలగొట్టండని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు పెట్టడం దుర్మార్గమైనదని వారు విమర్శించారు. రాష్ట్ర ప్రజలపై పాతికేళ్ళపాటు రూ.15వేల కోట్లు భారం వేసే ఈ ఒప్పందాన్ని విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఏపిఈఆర్సీ) ఆమోదముద్ర వేయడం అన్యాయమన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టం (2003)లోని 108వ సెక్షన్‌ను ప్రయోగించడం గర్హనీయమన్నారు. యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ నుండి యూనిట్ విద్యుత్‌ను రూ.4.60లు చొప్పున కొనుగోలు చేసేందుకు ఏపిఎస్పిడిసిఎల్ చేసుకున్న ఒప్పందాన్ని ఆమోదిస్తూ ఏపిఈఆర్సి ఉత్తర్వులు జారీ చేసింది. పాతికేళ్ళపాటు 400 మెగా వాట్ల విద్యుత్ కొనుగోలు ద్వారా యాక్సిస్ కంపెనీకి రూ.15 వేల కోట్లు పైగా లబ్ది కలుగుతుందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడే 2018లో ఈ దోపిడీకి ప్రయత్నించగా ప్రభుత్వం మారాక కోర్టుల చుట్టూ తిరిగిందన్నారు. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక యాక్సిస్ కంపెనీ పాత ప్రతిపాదనను డిస్కమ్ ఆమోదించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టం (2003)లోని సెక్షన్ 108కింద రిఫర్ చేయడం ద్వారా ఏపిఈఆర్సీ కూడా ఆమోదముద్ర వేయాల్సిన తప్పనిసరి పరిస్థితిని కల్పించిందన్నారు. రాష్ట్ర ప్రజలపై రూ.15వేల కోట్లు భారం మోపిందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చివరి భూముల వరకు రెండు పంటలకు నీరు ఇవ్వాలన్నారు. మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకాలను బాగు చేయించాలని, కాలువలు పూడికలు తొలగించి షట్టర్ బిగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. జిల్లాలో ఐటీడీఏ వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణ ఆపాలని, జీడికి 80 కేజీలు బస్తాకు రూ.16వేలు గిట్టుబాటు ధర ప్రకటించాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. పి ఫోర్ పేరుతో శ్రీకాకుళం నగరంలో ఉన్న ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడితే సహించేది లేదని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. నాలుగు లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సిపిఎం పార్టీ తన సంపూర్ణ మద్దతు తెలిపింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బి.కృష్ణమూర్తి, జి.సింహాచలం, నంబూరు షణ్ముఖరావు సిర్ల ప్రసాదు, సీహెచ్ అమ్మన్నాయుడు, పోలాకి ప్రసాదు తదితరులు మాట్లాడారు.



### మామిడి పండ్లు కృత్రిమంగా ముగ్గిస్తే చట్టపరమైన చర్యలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మామిడిపండ్లను కృత్రిమంగా ముగ్గిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ కంట్రోల్ అధికారి కె.వెంకటరత్నం వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాలో మార్కెట్, పరిసర ప్రాంతాలలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు పండ్ల దుకాణాల మీద శుక్రవారం దాడులు నిర్వహించారు. మామిడిపండ్లను శ్యాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపించారు.

నియోజకవర్గ పరిధిలో గల ఆమదాలవలస పట్టణంలో ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. అదే విధంగా వచ్చిన సమస్యలను పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

–సత్యంన్యూస్, ఆమదాలవలస



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ. వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# మట్టిరోడ్లతో మహాయాతన

- సప్త గ్రామాల సుదీర్ఘకాల సమస్య
- 2017లో పక్కారోడ్డుకు శంకుస్థాపన
- ఇప్పటికీ నిర్మాణానికి నోచుకోని వైనం
- ఉద్యమాలకు సిద్ధమవుతున్న స్థానికులు

(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

సాధారణంగా ఎక్కడైనా రోడ్డు ఉన్నంత కాలం ఆ సౌకర్యం ఆ ప్రాంతవాసులకు అందుబాటులో ఉన్నట్లే. కానీ ఆ ఏడు గ్రామాల పరిస్థితి దీనికి విరుద్ధం. వారికి ఏడాదిలో ఆరు నెలలు రోడ్డు అందుబాటులో ఉంటే.. మిగతా ఆరు నెలలు పొలాల గట్లే శరణ్యం. ఈ విచిత్రమైన సమస్యను కంచిలి మండలం జలంత్రకోట పంచాయతీ పరిధిలో ఉన్న ఆరు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం సమీపిస్తుందంటేనే వారు హడలిపోతున్నారు. ఈ గ్రామాలకు ఉన్న మట్టి రోడ్లపై వర్షాకాలంలో వాహనాలతో రాకపోకలు సాగించలేక అష్టకష్టాలు పడుతున్నారు. కనీసం నడిచి వెళ్లడానికి కూడా ఇబ్బంది పడాల్సి ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామాల చుట్టూ ఉన్న పంట పొలాల మధ్యలో వేసిన ఈ





మట్టిరోడ్లు వర్షాకాలంలో నీటిలో మునిగిపోయే ఉంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో రుతుపవనాలు గాడి తప్పి.. జూన్ నుంచి దాదాపు డిసెంబర్ వరకు వర్షాలు పడుతుండటం చూస్తున్నాం. దాంతో ఈ ఆరు నెలలూ బురద, నీటితో నిండిపోయే మట్టిరోడ్లపై నరకం చూస్తున్నామంటు న్నారు. వృద్ధులు, గర్భిణులు, విద్యార్థులు, కూలీలు, రోగులు సమీప పట్టణ ప్రాంతాలకు వెళ్లడానికి అష్టకష్టాలు పడాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. జూన్ మొదటి వారంలోగా ఈ సమస్యకు పరిష్కారం చూపించకపోతే రాజకీయాలకు అతీతంగా నిరహార దీక్షలు చేపట్టి నేషనల్ హైవేపై రాస్తారోకో చేస్తామని జలంత్రకోట పంచాయతీ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

**2017లో శంకుస్థాపన జరిగినా..**

ఈ గ్రామాలకు పక్కారోడ్డు నిర్మాణానికి టీడీపీ హయాంలో ఎమ్మెల్యే శంకుస్థాపన చేసినా, నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. వైకాపా హయాంలోనూ పట్టించుకోలేదు. పంచాయతీకి వచ్చే ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి ప్రతి ఏటా మరమ్మతులు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదయినా మార్పు లేదంటున్నారు. పల్లె పండగలో రోడ్డు దశ మారుతుందని ఆశించినా ప్రతిపాదనలు కూడా పంపకుండా నిర్లక్ష్యం చేశారు. జలంత్రకోట పంచాయతీ హెడ్ క్వార్టర్ నుంచి మిగతా ఆరు గ్రామాలు మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయి. జె.మాణిక్య పురం, చోట్రాయిపురం, పోటిగుడ్డి, ఉప్పరిపేట, చిలకలమెట్ట, మధుపురం గ్రామాలుగా రూపొందిన నాటి నుంచి రవాణా సౌకర్యం కొరవడింది. 2024 ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే టీడీపీ నుంచే గెలిచారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నియోజకవర్గంలో మొట్ట మొదట కొబ్బరికాయ కొట్టి ఇక్కడ నుంచే అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చి ఏడాది పూర్తి అయింది. అయినా ఇప్పటి వరకు ఆ హామీకి అతీగతీ లేదని గ్రామస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు.



# యూపీ స్కూళ్లలో తెలుగుకు మంగళం!

- టీచర్ పోస్టులు ఎత్తివేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు
- మాతృభాషకు అన్యాయం చేస్తున్నారన్న ఆందోళన
- జీవోను రద్దు చేయించాలని భాషోపాధ్యాయ సంఘం డిమాండ్
- కేంద్రమంత్రి రాముకు, ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



తెలుగు భాషకు ప్రాధాన్యమిస్తున్నా మంటున్న రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులే లేకుండా చేస్తోందని తెలుగు భాషాభిమాను లతో పాటు రాష్ట్ర తెలుగు భాషోపాధ్యాయ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. విద్యాశాఖ తాజాగా విడుదల చేసిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణ (రేషనలైజేషన్) జీవోలో పొందుపర్చిన నిబంధనలు ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులు లేని పరిస్థితి కల్పిస్తాయన్న ఆందోళన వ్యక్తమవు తోంది. 2001లో విస్తృతంగా ప్రాథమికో న్నత పాఠశాలలు నెలకొల్పి నప్పుడు రూపొందించిన స్టాఫ్ పాటర్న్ ప్రకారం నేటి వరకు కొనసాగించడం ద్వారా సబ్జెక్ట్ టీచర్లకు కొరత లేకుండా మెరుగైన విద్యా ప్రమాణాలు సాధించామన్న విషయాన్ని విస్మరించిన పాఠశాల విద్యా శాఖ ఇప్పుడు ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు టీచర్ పోస్టును ఎత్తివేయడం తెలుగు భాషకు అన్యాయం చేయడమే అవుతుంది. ఈ నిర్ణయం వల్ల ఆరు నుంచి ఎనిమిది తర గతుల విద్యార్థులకు తెలుగు బోధన ఎవరు చేస్తారో? అసలు ఎవరి సలహాతో ఈ నిర్ణయం తీసుకున్నారో అర్థం కావడం లేదు. విద్యా హక్కు చట్టం ప్రకారం నిర్దేశత సామర్థ్యాలు లేకుండా ఏ ఉపాధ్యాయుడు ఏ తరగతి విద్యార్థులకు బోధించకూడదు. అయితే విద్యార్థుల సంఖ్య ఆధారంగా తెలుగు పోస్టును ఎత్తివేయడం విడ్డూరంగా,



ఆశ్చర్యకరంగా ఉంది. 75 మంది విద్యా ర్థులు ఉన్న ప్రాథమికోన్నత విద్యార్థులు ఉన్న చోట ఉన్నత పాఠశాల మంజూరు చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 141 దాటి తేనే తెలుగు టీచర్ పోస్టు మంజూరు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. ప్రాథమికోన్నత స్థాయిలో తెలుగు బోధన నిలిచిపోతే ఆ తర్వాత తొమ్మిది, పది తరగతుల్లో విద్యార్థులు తెలుగు సబ్జెక్టులో వెనుకబడతారన్న విషయాన్ని ఎలా విస్మ రించారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్హేతుకంగా ఉన్న ఈ రేషనలైజేషన్ జీవో లోని ఇటువంటి అంశాలను తొలగించాలని, ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు టీచర్ పోస్టులను పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చొరవ తీసుకో వాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు పిసిని వసంతరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కూన రంగనాయకులు, గొడబ మేరీ ప్రసాద్, చింతపల్లి జనార్ధన రావు, మజ్జి వెంకట రమణ, అరసవల్లి గణపతిరావు, రాడ గణపతిరావు, వడిగి రమణమూర్తి, గోర అమర్‌నాథ్, వై.విశ్వ నాథం, రాణ సంధ్యా రాణి, దున్న విజయ లక్ష్మి తదితరులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు.

# వరదాంజనేయునికి అష్టోత్తర పుస్తకార్చన





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హనుమజ్జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని పెబ్బేరు దగ్గరలో గల బీచుపల్లి క్షేత్రంలోని 15వ శతాబ్దం నాటి శ్రీ వరదాంజనేయ స్వామి ఆలయంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు తమ స్వీయరచనగా అభయప్రసన్న మారుతి అనే 108 పుస్తకాలతో స్వామివారికి అర్చన జరిపించి, వాటిని భక్తులకు వితరణ చేయమని ఆలయ ప్రధానార్చకులు జ్యోషి మారుతాచారికి అందజేశారు. ఈ పుస్తకంలో పురాణ ప్రసిద్ధ, సుప్రసిద్ధ, విచిత్ర, అద్భుత, ఎత్తైన విగ్రహాలు గల స్వామికి చెందిన 108 ఆలయాల విశేషాలను, స్వామి చరిత్ర, ఆరాధనా స్తోత్రాలను పొందుపర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు బోయ నరసింహ, బోయ సత్యం తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆదిత్యుని కళ్యాణం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి కళ్యాణం వైభవం గా నిర్వహించారు. గురువారం వైశాఖ బహుళ ఏకాదశి పురస్కరించుకొని స్వామి వారికి కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. ఆలయ అర్చకులు, వేద పండి తులు వేద మంత్రాలు, మంగళ వాయి ద్యాల నడుమ స్వామివారి కళ్యాణం వైభ వంగా జరిగిందని ఆలయ కార్యనిర్వాహ ణాధికారి యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.

# వంకర తీసిన శంకర

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవల్లి టీడీపీ ఇన్‌ఛార్జిగా ఉన్న ఉంగటి వెంకటరమణను నగర పార్టీ అధ్యక్షుడ్ని చేసి, కప్పగంతుల కార్యకర్తలకు చెక్ పెట్టాలని ఎమ్మెల్యే గొండు శంకర్ భావిస్తున్నారు. కానీ, ఎమ్మెల్యేతో పాటు నగర పార్టీ అధ్యక్షుడు కూడా వెలమే అవుతారేమోనన్న కోణంలో పార్టీ అభ్యంతరం చెబుతుందన్న భావన శంకర్‌కు ఉంది. అలా కాకుండా ఇతర పార్టీల అధ్యక్షుల్ని లెక్కలోకి తీసుకుంటే ఉంగటి వెంకటరమణ గట్టి పోటీయే ఇస్తున్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ధర్మాన ప్రసాదరావు ఉన్నప్పుడు నగర పార్టీ అధ్యక్షుడిగా అదే సామాజికవర్గానికి చెందిన సాధు వైకుంఠరావు పని చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అంబటి కృష్ణ పోటీ చేసినప్పుడు అదే సామాజికవర్గానికి చెందిన గోవింద మల్లిబాబు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. బీజేపీ నుంచి చల్లా వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి, ఆ తర్వాత కాలంలో ఆయనే టౌన్ బీజేపీ అధ్యక్షుడిగా పని చేశారు. కాబట్టి ఉంగటి రమణకు అడ్డు లేదనుకుంటే అలా ముందుకు పోతారు. లేదూ అంటే మాత్రం పాండ్రంకి శంకర్ (కాపు), కోరాడ హరిగోపాల్ (కళింగకోమటి)లతో పార్టీ సంస్థాగత ఎన్నికల పూర్తయిందనిపిస్తారు.

మహానాడు లోపు పార్టీని నియోజకవర్గాల స్థాయిలో సంస్థాగతంగా పునర్నిర్మించాలని పిలుపునివ్వడం వల్ల నెల రోజులు పైబడి ఎమ్మెల్యే గొండు శంకర్ దీని మీద తీవ్ర కసరత్తు చేశారు. అందులో భాగంగానే కులాలు, ప్రాంతాలను పరిగణలోకి తీసుకొని కమిటీని ఖరారు చేసినట్లు తెలుస్తుంది. బూత్ లెవెల్‌లో కమిటీలు వేయాలి, వార్డు ఇన్‌ఛార్జిలు సమావేశానికి రావాలని పిలుపునిస్తే, కొన్ని డివిజన్లలో సరైన స్పందన కనపడలేదు. మరికొన్ని డివిజన్లలో నామ్కే వాస్తేగా వచ్చి మొక్కుబడి మీటింగ్‌లో కూర్చుని వెళ్లిపోయేవారు. గొండు శంకర్ కూడా చాలా రోజుల నుంచి ఇటువంటి వారిని పొమ్మనలేక, పొగబెట్టలేక మోసుకు తిరిగారు. అయితే ఇప్పుడు సంస్థాగత నిర్మాణం పుణ్యమాని ఇటువంటి చాలామంది ఇన్‌ఛార్జిలను ఇంటికి పంపించేస్తున్నారు.

2024 ఎన్నికల్లో టీడీపీ తరఫున గొండు శంకర్ టిక్కెట్ తెచ్చుకుంటే, ఆయన్ను కొందరు ఓపెన్‌గానే వ్యతిరేకించగా, మరికొందరు మాత్రం అప్పటి ఎంపీ రామ్మోహన్‌నాయుడు, పార్టీ అధ్యక్షుడు కూన రవికుమార్‌లపై ఒత్తిడి తెచ్చి మరీ తమ పంతం సాధించుకున్నారు. తీరా పోల్ మేనేజ్‌మెంట్ దగ్గరకు వచ్చేసరికి తెర వెనుక కుట్రలు పన్నడంతో ఈసారి కమిటీ కూర్పు ఎలా ఉంటుందోనన్న ఆసక్తి అందరిలోనూ రేకెత్తింది. ఎందుకంటే గడిచిన ఎన్నికల్లో శంకర్ గెలుపు కోసం ఏమాత్రం పని చేయకుండా వెన్నుపోటు రాజకీయాలు చేసినవారినే ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత అక్కున చేర్చుకున్నారనే వాదన బలంగా వినిపించింది. ఎమ్మెల్యే కూడా ఇది తన దృష్టిలో ఉన్నా, అటువంటి వారెవర్నీ దూరం పెట్టే ప్రయత్నం చేయలేదు. నగరం మీదే రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడి దృష్టి ఉండటం, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు కార్యాలయం ఇక్కడే ఉండటం వంటి కారణాల వల్ల ఎవరు ఎవరితో ఉన్నారు? ఎవరు వెన్నుపోటు పొడిచారు? అన్న అంశాల జోలికి గొండు శంకర్ ఇన్నాళ్లూ పోలేదు. కానీ తొలిసారిగా తనకు అనుకూలంగా కమిటీని ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఎన్నికలు జరిగిన ఏడాది తర్వాత సంస్థాగతంగా పార్టీ నిర్మాణం చేపడుతున్నందున పాత, కొత్త కలయిక తప్పదు. కాకపోతే సింబల్ మేరకు తనతో వచ్చినవారికి మాత్రం ఆయన అగ్రతాంబూలం ఇచ్చారు. ఇందులో భాగంగానే పాండ్రంకి శంకర్, కోరాడ హరిగోపాల్‌కు ప్రధాన పోస్టులు దక్కనున్నట్టు భోగట్టా. వాస్తవానికి నగర అధ్యక్ష పదవికి చాలామంది పోటీ పడ్డారు. బరిలో ఆర్థికంగా, సామాజికంగా బలంగా ఉండే వ్యక్తులు కావాలని శంకర్ కూడా భావించారు. ఆ కేటగిరీలో ఫిల్టర్ చేస్తే నలుగురు తేలారు. కానీ గడిచిన ఎన్నికలకు ముందు తాను టిక్కెట్ ఊగిసలాటలో ఉన్నప్పుడు, వచ్చిన తర్వాత చివరి వరకు గుండ కుటుంబంతో అంటిపెట్టుకుని ఉన్నవారిని వేరుగా చూస్తే పాండ్రంకి శంకర్, కోరాడ హరిగోపాల్‌లు, ఉంగటి వెంకటరమణ నిగ్గుతేలినట్టు భోగట్టా. బలగ ప్రాంతం నుంచి శంకర్ సర్పంచ్‌గా ఉన్నప్పుడు కూడా అనుచరుడుగా ఉన్న రెడ్డి గిరిజాశంకర్‌కు పట్టణ తెలుగు యువత అధ్యక్ష బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలుస్తుంది.

ఇక 50 డివిజన్లలోనూ కేవలం గడిచిన ఎన్నికల్లో తన పట్ల విధేయత చూపినవారికే శంకర్ పెద్దపీట వేశారు. ఒకే ఇంటిలో రెండు వార్డులకు ఇన్‌ఛార్జిలు ఉండటం, భార్యాభర్తలో, తల్లీకొడుకులో, తండ్రీ కూతుర్లో వేర్వేరు వార్డుల్లో ఇన్‌ఛార్జిలుగా వ్యవహరించడం వంటివాటికి ఫుల్‌స్టాప్ పెట్టారు. దీంతో 50 డివిజన్లలో అందర్నీ సర్దుబాటు చేశారు. ఏది ఏమైనా గెలిచిన ఏడాది తర్వాత ఎమ్మెల్యే శంకర్ తన సొంత టీమ్‌ను తయారుచేసుకోగలుగుతున్నారు. ఎన్నికల నాటికి, ఇప్పటికి జరిగిన అనేక పరిణామాలు కూడా శంకర్ కొత్త జట్టు కూర్పునకు ఉపయోగకరంగా మారింది.

ఇప్పటికీ గుండ కుటుంబంతో ఎవరు టచ్‌లో ఉన్నారో, వైకాపాతో కలిసి గ్రామాల్లో ఎవరు రాజకీయాలు చేస్తున్నారోనన్న డేటా ఎమ్మెల్యే వద్ద ఉంది. ఉదయం లేచింది మొదలు అర్ధరాత్రి ఇంటికెళ్లేవరకు బయటే ఉండే ఎమ్మెల్యేకు ఎప్పటికప్పుడు స్థానికుల నుంచి రిపోర్టులు అందడం వల్ల ఈ కూర్పునకు ఇవన్నీ ఉపయోగపడ్డాయి. ఇది కార్పొరేషన్ ఎన్నికల టీమ్ కాదు గానీ, 2029 సార్వత్రిక ఎన్నికలకు మాత్రం మళ్లీ ఇందులో మార్పులు, చేర్పులు తథ్యం. వాస్తవానికి యువకుడికి మాత్రమే నగర అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తారని, అందులో భాగంగానే వరం తనయుడు సంతోష్ పేరు పరిశీలనలో ఉందని అంతా భావించారు. అయితే, పార్టీకి వెళ్లిన జాబితాలో మాత్రం శంకర్, హరిగోపాల్, ఉంగటిల పేర్లే ఉన్నట్లు తెలుస్తుంది. నగర టీడీపీ ప్రధాన కార్యదర్శిగా రెడ్డి గిరిజాశంకర్‌కు ఇవ్వాలని భావించినా, కళింగ వైశ్య సామాజికవర్గం నుంచి ప్రాతినిధ్యం ఉండాలని హరిగోపాల్ పేరును పరిగణలోకి తీసుకున్నారు. ఇప్పటికే ఉంగటి రమణను ప్రభుత్వ పథకాల అమలుకమిటీలో సభ్యుడిగా నియమించారు. అలాగే అంధవరపు సంతోష్‌ను రిమ్స్ జనరల్ ఆసుపత్రి సలహామండలి సభ్యుడిగా ప్రతిపాదించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే శంకర్ వద్ద ఉంది అని చెబుతున్న జాబితా మేరకైతే అధ్యక్ష, కార్యదర్శులుగా పాండ్రంకి శంకర్, కోరాడ హరిగోపాల్ పేర్లు వినిపిస్తున్నాయి. మాదారపు వెంకటేష్ కొద్ది రోజుల క్రితమే తాను రేస్‌లో లేనని ప్రైవేటుగా ప్రకటించినట్లు తెలుస్తుంది. ఇక కొర్ను నాగార్జున ప్రతాప్‌కు ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా ఎమ్మెల్యే చుట్టూ తిరిగే వర్గం నుంచే వచ్చినప్పటికీ, ఆ పేరును అంగీకరించరని తేలింది. దీనికి తోడు ప్రతాప్ కూడా తన మద్దతు శంకర్‌కు ఉంటుందని చెప్పినట్లు భోగట్టా. శంకర్, హరిగోపాల్‌కు ఖరారైతే ఉంగటి రమణ సేవలను జిల్లా పార్టీకి వాడుకోనున్నట్టు భోగట్టా.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.